# మీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు చూశాక.....!

ప్రిన్సిపాల్ గార్కి,

మీ స్కూల్ 'సిల్వర్ జూబ్లీ' సందర్భంగా శుభాభినందనలు! పూర్వపు రోజుల్లో పెళ్ళంటే... 16 రోజుల పండుగ అనేవారు. ఈ రోజుల్లో అయితే ఎంగేజ్‌మెంట్ మొదలు అమ్మాయిని అత్తారింటికి పంపటమో... తెచ్చుకోవటమో... మూడ్రోజుల పండుగలా వుంటుంది. మీ 'సిల్వర్ జూబ్లీ' వేడుకలూ అంతే ! ఈ మూడ్రోజులూ మరపురాని మధురానుభూతుల్ని మిగిల్చాయి ప్రేక్షకులకి.

మొదటి రోజు ఒక ఉన్నతస్థాయి వ్యక్తి... సర్వదా సర్వత్రా బహుదా ప్రశంసనీయులైన శ్రీ యస్.పి. బాలుగారి రాక కార్యక్రమాన్ని మరింత శోభాయమానం చేసింది.

వినయం పాలు ఎక్కువైన బాలూ... ఎంత ఎదిగిన మనిషో... ఆ ఉపన్యాసం వింటే తెలుస్తుంది. ఆ మహానుభావుడ్ని చూసి... నేర్చుకోవలసింది ఎంతోవుంది... మా బోటి వాళ్ళకి! దేశం గర్వించదగిన వ్యక్తిని, విదేశాల్లో సైతం తన గానమాధుర్యంతో దేశ సంస్కృతిని ప్రతిబింబింపజేస్తూ - దేశానికి కీర్తి ప్రతిష్ఠల్ని తెచ్చిపెడుతున్న ఆ విశిష్ట వ్యక్తిని పాతికేళ్ళ పండుగకి అతిథిగా రప్పించడం మా ప్రేక్షకుల అదృష్టం !

'నీల మోహనా రారా!' కృష్ణుడు అందంగా వున్నాడు. రాధ అభినయం బావుంది. కానీ డ్రెస్ మరీ బుట్టలా వుండి స్టెప్స్‌ని సరిగా ఫోకస్ చేయించలేక పోయింది !

హాస్యరసాత్మకమైన 'సీతాపహరణం' ఉరఫ్ ద్రౌపదీ వస్త్రాపహరణం రూపకం పిల్లలచేత అభినయింపజేయటం ఎంతైనా మెచ్చుకోదగింది.

అవునూ... ఈ మధ్య, వీధి భాగవతాల మీద మీ మనసు పోతోందేమిటి చెప్మా ? అంతేకాదూ... హఠాత్తుగా అలా కృష్ణభక్తులై పోయారేంటి అంతానూ! అయితే అయ్యారుకానీ - ఓ 'శివస్తుతి'ని కూడా జతచేస్తే నా బోటి ద్వైత భావుకులు సంతృప్తి పడతారు కదా !

అమృతావేడంగారి పుస్తకావిష్కరణ జరగటం ఎంతో సంతోషించాల్సిన విషయం! స్కూల్‌డేతో లింకప్ అవటం వల్ల పుస్తక పరిచయం సరిగ్గా జరగ లేదనిపించింది. చక్కటి పుస్తకం, 'అమృతవర్షిణి'- ఆవిష్కరణ అలా హడావుడిగా జరగటం అనంతృప్తిగా అనిపించింది. నిజానికి ఇది టాలెంట్‌షో ఏ స్థాయిలో చేస్తారో ఆ స్థాయిలో జరగాల్సిన పండుగ! సందట్లో సడిలా... మొక్కుబడిలా జరిగిపోయింది. (బాలూగారి చేత ఆవిష్క రింపబడిందన్న తృప్తి ఒక్కటే మిగిలింది!)

ఇక రెండో రోజు - చలి మొదటిరోజుతో పోలిస్తే చాలా తక్కువగా వుంది..... క్రిక్కిరిసిన ప్రేక్షకులతో గ్రౌండ్ కళకళలాడింది.

కొత్తగా స్టేజీ కట్టించి ఎక్కువమంది కూర్చోవటానికి వీలుకల్పించి - మంచిపని చేశారు.

' మా వూళ్ళో ఒక పడుచుంది'... పాట అభినయంలో చిన్నపిల్లలే అయినా 'ఆ వూళ్ళో ఒక చిన్నోడు - నేనున్నాలే పదమన్నాడు' - అంటూ ఆరిందాతనాన్ని చూపి పోజులు కొట్టటం బలే సరదాగా వుంది.

మంచి భావ ప్రకటనగల ముద్రలతో, తగిన కాస్ట్యూమ్స్‌తో 'పిలువకురా' నాట్యం రమ్యంగా వుంది.

బాయ్స్ & గర్ల్స్ కలిసి చేసిన 'కజ్‌రారే' డ్యాన్స్- పాటలో ఎంత ఊపుందో - నాట్యంలో కూడా అంతే! ముందుగా అమ్మాయిల రంగప్రవేశం - మధ్యలో అబ్బా యిలు ఎంటర్ అవటం బావుంది. కనీసం చేతులు కూడా టచ్ కాకుండా - సభ్యత పాటిస్తూ రసావిష్కరణ జరిపించి రక్తి కట్టించేలా... అభినయంలో తర్ఫీదునివ్వటం... ఒక్క 'విజయ్'కే చెల్లింది. హ్యాట్సాఫ్ !

చాలా పాత పాటైన 'ఒలియో ఒలియో'ని వెతికి వెలికి తీసినవారూ - నాట్యంగా మలిచిన వారూ - అభినయించిన వారూ అందరూ అభినందనీయులే!

'డోల్ డోల్', 'రెమో', 'అదిరే' డాన్స్‌లు బావున్నాయి. ముఖ్యంగా 'అదిరే'లో ఆవులుగా అభినయించిన (2+2 మంది)... పిల్లల స్టెప్పులు అమోఘం! పాపం వాళ్ళకి ఏదైనా స్పెషల్ ప్రైజ్ ఇవ్వకూడదూ!

ఇహ మూడో రోజు 'రిలాక్స్' అయి నట్టున్నారు కాస్త! తీరుబడిగా జరిగింది ప్రోగ్రాం! ఆ రోజటి కార్యక్రమంలో కోలాటం - లంబాడీ డాన్స్‌లు బావున్నాయి.

ఎక్స్-టీచర్స్ అనుభవాలూ,అనుభూతులు... ప్రేక్షకులమైన మేమూ పంచుకున్నాం ! అంతకు ముందు రోజు ప్రదర్శింపబడిన GLIMPSES OF 'VIJAY' వీడియో క్లిప్పింగ్స్‌లో అమృతలత గారి మాటల్ని కోట్ చేస్తూ - 'ఎప్పటిపని అప్పుడే ముగించుకోవాలి - రేపేం జరుగుతుందో తెలీదు - వాయిదా వేయకూడద'న్న పాయింట్‌ని సరిగ్గా క్యాచ్ చేసి, ఆ మర్నాడే పొందికైన మాటల్లో పొందుపరుస్తూ - విజయ్ హైస్కూల్ విజయ రహస్యాన్ని విప్పి చెప్పిన సోమేశ్వర్లు అభినంద నీయులు!

కానీ - ఆనాటి విద్యార్థులూ, ఉపాధ్యా యులూ, ఇప్పటి విద్యార్థులూ, ఉపాధ్యాయులూ ఇతరత్రా ముఖ్యులు తప్ప - బయటి ప్రేక్షకులకి ఆ ప్రోగ్రామ్ వీక్షించే అవకాశం దొరకలేదు !

మీ పద్ధతులూ - క్రమశిక్షణా - ముఖ్యంగా సాంస్కృతిక కార్యక్రమాల పట్ల స్కూల్లో పనిచేసే.... ఆబాలగోపాలానికీ వున్న స్పెషల్ ఇంటరెస్ట్ చూస్తోంటే ఎంతో ముచ్చటేసింది!

మరోమాట - ఈ మూడురోజుల పండుగలో మీరిచ్చిన ఆతిథ్యం మరపురానిది! మిత్రుల్తో కలిసి సరదాగా అందమైన అవుట్ డోర్‌కి వెళ్ళి ప్రకృతి రమణీయకతలో మమేకమైపోయినంత తీయటి అనుభూతిని పొందాను.

-ఇందిరాదేవి.

తేదీ: 25-11-2005



